క్లుప్తంగా

సాగునీరందించేలా చర్యలు : ఎంపీ

నందిగామ టౌన్:వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాసంలో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల ముఖ్యనాయకులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలతో కలిసి ఒకటిరెండు రోజుల్లో ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తానన్నారు. నందిగామ, కొండపల్లి మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎంపిక కోసం ఎన్నికల అధికారితో చర్చించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఏ సమస్యలున్నా ఎమ్మెల్యేల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, నాయకులు కోగంటి బాబు, కోట వీరబాబు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగ నియంత్రణకు చర్యలు :ఎస్ఐ

జగ్గయ్యపేట:మాదకద్రవ్యాల వినియోగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గౌరవరం, షేర్‌మహ్మద్‌పేట గ్రామాలలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు గ్రామాల పరిధిలో రాత్రివేళల్లో యువత గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఆయా ప్రాంతాల్లో రోజూ సాయంత్రం ఐదు నుంచి రాత్రి 11 గంటల వరకు పోలీసు సిబ్బందితో పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. యువత మత్తుకు బానిస కాకుండా గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐకోరారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

జయంతి(వీరులపాడు): అప్పుల బాధ తాళలేక ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం వీరులపాడు మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని జయంతి గ్రామానికి చెందిన షేక్ బాజీ(40) ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబపోషణ కోసం అప్పులు చేసిన బాజీ, వాటిని తీర్చేదారిలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గ్రామంలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

శానిటరీ సామగ్రి అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శానిటేషన్ సక్రమ నిర్వహణకు పెనుగంచిప్రోలులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్‌మేనేజర్ మాణిక్యరావు సోమవారం రూ.3వేల విలువైన శానిటరీ సామగ్రిని వితరణగా అందజేశారు. మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా ఆర్టీసీ సీఐ రజనీ చేతుల మీదుగా ఈ సామగ్రిని అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాణిక్యరావు ఎమ్మెల్యే తాతయ్యకు వినతిపత్రాన్ని అందజేయగా, పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి



వైద్యులతోపాటు అన్ని రంగాల్లోని మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం పటిష్ట రక్షణ కల్పించాలి. రోజురోజుకు మహిళలపై దాడులు అధికమవుతున్నాయి. ప్రభుత్వాలు రక్షణ కల్పిస్తేనే స్వేచ్ఛగా బయటకు వచ్చి ఉద్యోగాలు చేసుకోగలం. దేశంలో కఠిన చట్టాలు ఉండటతోపాటు నిందితులకు కఠిన శిక్షలు కూడా పడాలి.

– డాక్టర్ దీప్తి,
వీరులపాడు పీహెచ్‌సీ

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యం అత్యంత పాశావిక చర్య. ఈ ఘటనకు పాల్పడిన వారికి విధించే శిక్ష మరోసారి ఇటువంటి దాడులకు పాల్పడాలనుకునే వారికి గుణపాఠం కావాలి. అటువంటి కఠిన శిక్షలు అమలుచేసినపుడే ఇటువంటి దుశ్చర్యలు ఆగుతాయి. ఆ దిశగా ప్రభుత్వాలు స్పందించాలి.

– డాక్టర్ నందిని,
వీరులపాడు పీహెచ్‌సీ

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీకృష్ణుని ఆలయాలను సందర్శించి స్వామివార్లకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. చిల్లకల్లురోడ్‌లోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో తొలుత అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచార్యులు స్వామివార్లకు తులసీమాలలు, నెమలి పింఛాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడు, గోపికల విగ్రహాలతో ఏర్పాటు చేసిన అలంకరణ ప్రత్యేకాకర్షణగా నిలిచింది.

అలరించిన చిన్నారులు...

పట్టణంలోని తల్లిదండ్రులు తమ చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో ముస్తాబు చేసి మురిసిపోయారు. దుర్గాపురం బాలబాలికలు ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చేసిన కోలాటం అందరినీ అలరించింది.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం పెనుగంచిప్రోలు మండలంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, పాలకవర్గసభ్యులు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్లు కాకాని శ్రీనివాసరావు, కర్ల వెంకటనారాయణ, వాసిరెడ్డి బెనర్జీ, వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబు చేసి సంబరపడ్డారు.



జగ్గయ్యపేట వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేకాకర్షణగా నిలిచిన శ్రీకృష్ణుడు, గోపికల విగ్రహాలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అమ్రితసాయి ఇంజినీరింగ్ విద్యార్థులు



శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేస్తున్న అమ్రితసాయి యాజమాన్యం

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: కృష్ణాష్టమి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. రామచంద్రునిపేటలోని కృష్ణ మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పోచంపల్లిలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. గ్రామస్తులు ఉట్టికొట్టి సందడి చేశారు.

నందిగామ పట్టణంలో...

నందిగామటౌన్: మండలంలోని గ్రామాలతోపాటు పట్టణంలోని పలు వీధుల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని కృష్ణుని ఆలయాలలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో లలితా విష్ణు వాసవి జ్ఞానవాహిని మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన 108రకాల ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలోని చిన్నారులు ఉట్టికొట్టి సందడి చేశారు. చిన్నాపెద్దా వయోబేధం లేకుండా అందరూ ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మారం వెంకటేశ్వరరావు, అమరయ్య, దుద్దు నాగేశ్వరరావు, కేతేపల్లి ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు చవట నాగేశ్వరరావు, పబ్బతి సీతారాంగుప్త, మహంకాళి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: మండల ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. అదేవిధంగా పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ కార్యదర్శి కే రామ్మోహనరావు మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవిత చరిత్ర, గీతాసారాంశం ద్వారా మన జీవన విధానం, గురువులపై గౌరవ మర్యాదలు కలిగి ఉండటం, జ్ఞానసముపార్జన, స్ఫూర్తి పొందడం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుని పరిపూర్ణవ్యక్తిగా జీవించటాన్ని అలవరచుకోవచ్చని సూచించారు. విద్యార్థులు కృష్ణుడి, గోపికల వేషధారణలో అలంకరించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పేట వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



తిరుపతమ్మ ఆలయం వద్ద గోవులను పూజిస్తున్న సిబ్బంది



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



పెనుగంచిప్రోలులో ఉట్టి కొడుతున్న గ్రామస్తులు



వాసవీ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన 108రకాల ప్రసాదాలు



పోచంపల్లిలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు

డంపింగ్ యార్డు నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

మున్సిపల్ సిబ్బందికి చైర్మన్ హితవు

జగ్గయ్యపేట అర్బన్: విలియంపేటలో డంపింగ్ యార్డు నిర్వహణలో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ అధికారులకు హెచ్చరించారు. డంపింగ్ యార్డును సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ యార్డును ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ పరిస్థితి మారాలన్నారు. డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు నిర్వహణపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమం

జగ్గయ్యపేట అర్బన్: కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా సోమవారం స్థానిక శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరామ్ పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో ఆనవాయితీ ప్రకారం యాదవ కుటుంబీకులచే ఉట్టి కొట్టించే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉట్టికొట్టిన విజేత గోళ్ల సైదులుకు ఎమ్మెల్యే రాజగోపాల్, శివరామ్ చేతుల మీదుగా నగదు బహుమతిగా రూ.2,116 అందించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పోటీపడగా, కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. అర్చకులు శ్రీరంగం శ్రీనివాసచార్యులు ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం శివరామ్‌లకు తీర్థప్రసాదాలను అందజేశారు.



పేట సంతానవేణుగోపాలస్వామి ఆలయంలో ఉట్టి కొడుతున్న యువకులు

గండి పూడ్చివేత పనుల పరిశీలన

పోలంపల్లి(వత్సవాయి):పోలంపల్లి మునేటి డ్యాం గండి పూడ్చివేత పనులను సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. ఇటీవల మునేటికి వచ్చిన వరదల కారణంగా గతంలో గండి పూడ్చివేసినప్పటికీ వరద ఎక్కువగా రావడంతో గండి కొట్టుకుపోయింది. దీంతో మునేటి కాలువ నీరు ఎక్కకుండా నీరంతా వృధాగా పోతోంది. సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో గండిపూడ్చివేత పనులను ప్రారంభించారు. మునేటికి కాలువకు నీరు ఎక్కేందుకు అనువుగా ఆనకట్ట వద్ద అడ్డంగా ఇసుక బస్తాలను వేసి పూడ్చుతున్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ త్వరలో మునేటి కాలువకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వివరించారు. ఇరిగేషన్ జేఈ నరసింహరావు,మాజీఎంపీటీసీ ఆవుల రామారావు, వంకాయలపాటి బ్రహ్మం పాల్గొన్నారు.



గండి పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్

మెళకువలు పాటిస్తే మిర్చిలో అధిక దిగుబడులు



కృష్ణంరాజు

పెనుగంచిప్రోలు: దేశంలో మిర్చి పంటసాగులో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. ప్రస్తుతం రైతులు మిర్చి తోటల సాగు చేపట్టారు. అత్యధిక పెట్టుబడులు అవసరమయ్యే మిర్చిసాగులో రైతులు కొన్ని మెళకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచిస్తున్నారు. మిర్చిలో విత్తనశుద్ధి, వాడాల్సిన ఎరువులు, సమగ్ర యాజమాన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

విత్తనశుద్ధి...

విత్తనం ద్వారా వ్యాప్తి చెందే చీడపీడలను నివారించటానికి తప్పకుండా విత్తనశుద్ధి చేసుకోవాలి. రసం పీల్చే పురుగులు నివారణకు 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, తెగుళ్ల నివారణకు 3గ్రాముల మాంకోజెబ్ మందును ఒక కిలో గ్రాము మిరప విత్తనంలో కలిపి శుద్ధి చేసుకోవాలి. వైరస్ బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో ట్రైసోడియం ఆర్థో పాస్ఫేట్ అనే మందును 150 గ్రాములు లీటర్ నీటిలో కలిపి, ఒక కిలో విత్తనాన్ని 30నిమిషాలు నానబెట్టి మంచినీటిలో శుభ్రపరచి మరలా ఆరనిచ్చి విత్తాలి.

నారుమడి యాజమాన్యం...

నారు పెంచేందుకు ఎకరానికి 650 గ్రాముల విత్తనం అవసరం అవుతుంది. ఎద పెట్టేందుకు 2.5 కిలోల విత్తనం కావాలి. సంకర రకాలైతే 80 నుంచి 100 గ్రాముల విత్తనం సరిపోతుంది. విత్తన వృధాను తగ్గింపు కోసం నారుమడులు ఏర్పాటు చేసుకొని నారు పెంచుకోవడం ఉత్తమమైన పద్ధతి. ఎకరాకు మిర్చి సాగు కోసం 1సెంటు స్థలంలో నారుమడి ఏర్పాటు చేసుకోవాలి. ఈనారుమడిలో 80 గ్రాముల పిప్రోబిల్ గుళికలు వాడినచో రసం పీల్చే పురుగులను నివారించుకోవచ్చును. ఈనారుమడికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి ఈద్రావణాన్ని 9వ రోజు,15వ రోజు తడపాలి. 6 వారాల వయస్సు గల మొక్కలు నాటాలి.



నర్సరీల్లో పెంచుతున్న మిరపనారు

విత్తటం...

ఆరోగ్యకరమైన మిర్చినారును ఖరీఫ్ సీజన్‌లో జూలై, ఆగస్టులో, రబీ సీజన్‌లో అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రధాన పొలంలో వేసుకోవచ్చు.

ప్రధాన పొలం తయారీ...

ఆఖరు దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు, 150 కిలోల సింగిల్ పాస్ఫేట్, 200 కిలోల వేప పిండి, వేసుకోవాలి. 90 కిలోల పశువుల ఎరువు 10 కిలోల వేపపిండికి 2 కిలోల ట్రైకోడెర్మా శిలీపంద్రపు పొడిని కలిపి 12-15 రోజులు నీడలో ఉంచి శిలీంద్రం వృద్ధి చెందిన తరువాత భూమిలో కలయదున్నటం ద్వారా మొక్కలో తొలి దశలో ఆశించే తెగుళ్లను నివారించవచ్చు. వేరుపురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లో ఎకరానికి 10-12 కిలోల 3 శాతం కార్బోఫ్యూరాన్ గుళికలు ఆఖరు దుక్కిలో వేయాలి.

నారు నాటుకునే విధానం...

నారు మొక్కలను వాతావరణం చల్లగా ఉన్నప్పుడు నాటుకోవాలి. నాటే ముందు నారుని 10 లీటర్ల నీటిలో 5మి.లీ ఇమిడాక్లోప్రిడ్, 10 గ్రాముల కార్బండిజమ్ కలిపిన మందు ద్రావణంలో 5నిముషాలు ఉంచి నాటుకోవాలి. మొక్కలు వరుస మధ్య 75 సెం.మీ, మొక్కల మధ్య 45 సెం.మీ దూరం ఉండేటట్లు మొక్కలు నాటుకోవాలి.

ఎరువులు...

ఎకరానికి 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాష్ (260 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, 80 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్)ఎరువులు వేయాలి. మొత్తం భాస్వరం ఎరువును ఆఖరి దుక్కిలో లేదా నాట్లు వేసే సమయంలో వేయాలి. 65 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున మొక్కలు నాటిన 30, 60, 90, 120 రోజుల వయస్సులో నాలుగు దఫాలుగా వేయాలి. యూరియాను వేప పిండిలో కలిపి వేస్తే మంచిది. సూక్ష్మధాతు మిశ్రం 5గ్రాములు లీటర్ నీటిలో కలిపి నాటిన 30 రోజుల తరువాత పిచికారీ చేయాలి. ఐఐహెచ్ఆర్ బెంగుళూరు వారు తయారు చేసిన ఆర్కా వెజిటబుల్ స్పెషల్‌ను కూడా సూక్ష్మ పోషక లోపాలను సవరించుటకు వాడవచ్చు.

కలుపు నివారణ...

విత్తనాలు నాటిన రెండు నెలల లోపు లేదా నారు వేయటానికి 1-2 రోజుల ముందు పెండిమిథాలిన్ అనే కలుపు మందును ఎకరానికి 1.3 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నేల తడిచేటట్లు పిచికారీ చేయాలి. విత్తిన 25-30 రోజుల నుంచి 15-20 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి2-3 సార్లు గొర్రు లేదా గుంటకతో అంతర కృషి చేసి కలుపు నివారించుకోవచ్చు.

మిరప తోటల్లో సమీకృత యాజమాన్య పద్ధతులు

పంట మార్పిడి: ఏటా ఒకే పంటను పండించటం ద్వారా మిర్చిపంటకు చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. కావున బీన్స్, బంతి, ఉల్లి పంటలతో పంట మార్పిడి చేసుకుంటే మంచిది.

- తెగుళ్లను తట్టుకునే ధృవీకరించిన ఆరోగ్యవంతమైన విత్తనాలు ఎన్నుకోవాలి.
- విత్తనశుద్ధి తప్పక పాటించాలి.

కంచె పంటలు: జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను కంచెగా వేసుకుంటే మంచిది.

ఆకర్షక పంటలు: బంతి(పసుపు రంగు పూలు) మొక్కలు నులి పురుగులను తగ్గిస్తాయి. శనగ పచ్చ పురుగు ఉధృతిని అదుపులో ఉంచుతాయి.

- తెల్లదోమ ఉధృతిని తగ్గించుకోవటానికి గ్రీజు లేదా ఆముదం పూసిన పసుపురంగు అట్టలు లేదా డబ్బాలు పొలంలో అక్కడక్కడ ఉంచాలి.
- చీడలను నివారించుకోవటానికి రసాయన మందులు బదులు వేపనూనె లేదా వేపగింజల కషాయం వాడుకోవటం మంచిది. రసాయన మందులు వాడేవారు మందులను మార్చి మార్చి వాడాలి.
- ఆముదం మొక్కలను అక్కడక్కడ నాటుకున్నట్లయితే పొగాకు లద్దె పురుగును అదుపులో ఉంచుకోవచ్చు.

●తెలుగుభాషా సాంస్కృతిక కార్యక్రమం

నందిగామ టౌన్: తెలుగు చైతన్య దీపిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీస్కూల్ ఆవరణలో తెలుగు భాషా సాంస్కృతిక సారధి-2024 కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. కెవీఆర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ తుర్లపాటి కోటేశ్వరరావు, సత్యనారాయణ, లెనిన్ కుమార్, దాసరి రామకృష్ణ, అన్నం సతీష్, బి. సతీష్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.